క్లుప్తంగా

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. కావున షుగర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన నిత్య కల్యాణ మూర్తుల బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన సేవకుడు సత్య సాయినాథ శర్మ, పుణ్యభూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల రాక పోకలకు ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు వాహనాలు ఏర్పాటు చేశారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులై, కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని గుంతబజార్ ప్రాంతంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని 33/11కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కె.వి పార్నపల్లె రోడ్డు ఫీడర్, రాజీవ్ నగర్ ఫీడర్ల కింద విద్యుత్ స్తంభాల ఎరెక్షన్ కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని కొన్ని గ్రామాల్లో రెండో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జయరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా దర్బార్‌పేట, తిప్పిరెడ్డిపల్లె, వండ్లవాండ్లపల్లె, వెంకట్రామ్‌పల్లె, గంగనపల్లె, రాచవారిపల్లె, పేరన్నపల్లె, శివశంకరాపురం గ్రామాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం మండలాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోండి

లింగాల : మండలంలోని ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. ప్రభుత్వం రేషన్ కార్డులకు సంబంధించి 7 రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఆ సేవలను గ్రామ వార్డు సచివాలయాలలో పొందాలన్నారు. కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డులో కుటుంబ సభ్యుడిని చేర్చుట, తొలగించుట, కార్డును విభజన చేయుట, కార్డులో చిరునామా మార్పు చేసుకోవడం, తప్పుగా నమోదు కాబడిన ఆధార్ నెంబర్ సవరణ వంటి సేవలను పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏమాత్రం గౌరవం ఇవ్వలేదు

జమ్మలమడుగు : మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిని, వైస్ చైర్మన్‌ను అయిన తనకు మున్సిపల్ అధికారులు ఏమాత్రం విలువ ఇవ్వడంలేదని మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి పిలువటానికి వచ్చి తనకు అధికారులు కౌన్సిల్ సమావేశం తర్వాత బువ్వ పెడుతారు రమ్మని పిలవడం ఎమిటని ప్రశ్నించారు. సమావేశానికి పిలువాలే తప్ప ఇలా పిలవడం సరైనదా అని అధికారులను ఆయన ప్రశ్నించారు. అధికారులు తమకు రావలసిన గౌరవవేతం కూడా ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎర్పడి పదకొండు నెలలు అయిన ఇంత వరకు గౌరవవేతనం ఇవ్వలేదని తమ బాధను వ్యక్తం చేశారు.

నేడు వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి

పులివెందుల టౌన్ : దేశ సరిహద్దులో మన తెలుగు జాతి ముద్దుబిడ్డ వీర జవాన్ మురళీ నాయక్ అమరుడైన సందర్భంగా పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం మురళీనాయక్‌కు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలని కోరారు.

పడిపోయిన పచ్చి మిరప ధరలు

- మార్కెట్‌లో 50కిలోల బస్తా రూ.500
- ఎకరాకు లక్షకుపైనే పెట్టుబడులు
- తీవ్రంగా నష్టపోతున్న మిరప రైతులు



మబ్బుచింతలపల్లె వద్ద సాగులో ఉన్న మిరప తోట

వేముల : ఈ ఏడాది పచ్చి మిరప ధరలు పూర్తిగా పడిపోయాయి. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రైతులు వేసవి మిరప పంటను సాగు చేసుకున్నారు. మిరప పంటను మార్చి నెలలో మంచి ధరలు ఉంటాయనే ఉద్దేశ్యంతో రైతులు సాగుకు ఎంచుకున్నారు. పెట్టుబడులు అవుతున్నా ధరలు ఉంటే ఆదాయం ఉంటుందని ఆశించారు. అయితే రైతుల ఆశలకు భిన్నంగా ధరలు ఉండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో 2500 ఎకరాలలో సాగు

పులివెందుల నియోజకవర్గంలో ఈ ఏడాది 2500 ఎకరాలలో మిరప పంట సాగైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 20 శాతం మేర సాగు విస్తీర్ణం పెరిగిందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధిక విస్తీర్ణంలో సాగైతే చక్రాయపేట, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో అక్కడక్కడ మిరపను రైతులు సాగు చేసుకున్నారు. వేసవిలో మిరప పంటను పచ్చి మిరప కాయల కోసమే సాగు చేస్తారు. తోటలలో ఎప్పటికప్పుడు కోతకు వచ్చిన పచ్చి మిరప కాయలను కోత కోసం మార్కెట్‌కు తరలిస్తారు. వేసవి మిరపలో ఎండు మిరప కాయలుగా చేసుకునే అవకాశం లేకపోవడం, పచ్చి మిరపకాయలను కోత కోసి మార్కెట్‌కు తరలించి అమ్ముకోవడంతో రైతులు ధరల్లేక నష్టపోతున్నారు.

ఎకరాకు లక్షకుపైనే పెట్టుబడులు

మిరపను వ్యవసాయ బోర్లు, బావుల కింద సాగు చేస్తారు. ఎకరాకు 25వేల నుంచి 30వేల మొక్కలను నాటుతారు. బయట ప్రాంతాల్లోని నర్సరీల నుంచి వీఎన్ఆర్ 144 అనే రకాన్ని రైతులు సాగు చేశారు. తోటలలో మిరప నాటిన 15 రోజుల నుంచే మందులను పిచికారి చేయాల్సి ఉంటుంది. మిరప పంటకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. నాటిన మొదలు తోటలలో మిరప కోతలు పూర్తయ్యే వరకు సస్య రక్షణ చర్యలు తీసుకుంటేనే దిగుబడులు, లేకుంటే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతోనే రైతులు వారానికొకసారి మందును పిచికారి చేస్తారు.

మార్కెట్‌లో పడిపోయిన ధరలు

ఈ ఏడాది మార్కెట్‌లో పచ్చి మిరప కాయల ధరలు పూర్తిగా క్షీణించాయి. ప్రస్తుతం మార్కెట్‌లో 50 కిలోల మిరప కాయల బస్తా రూ.500లు మాత్రమే ధరలు ఉన్నాయి. గత ఏడాది మార్కెట్‌లో 50కిలోల బస్తా రూ.3వేల నుంచి రూ.4వేల ధరలు ఉండేవి. సాగులో పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ధరల్లేక మిరప కాయలు కోత కోసే కూలీలకు, మందులకు కూడా సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు ప్రారంభంలోనే ధరలు ఇలా ఉంటే తోటలలో పూర్తిస్థాయిలో మిరప కాయలు కోతకు వస్తే ఇంకా ధరలు పడిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

2 ఎకరాలలో మిరప సాగు చేశా



నాకున్న 2 ఎకరాలలో వేసవి పంటగా మిరప సాగు చేశా. ఎకరాకు లక్షకుపైనే పెట్టుబడులు పెట్టా. పంటకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నా. తోటలో మిరప కాయలు కోతకు వస్తున్నాయి. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో మిరప కాయలు కోత కోయకుండా ధరల కోసం ఎదురుచూస్తున్నా. ధరలు ఇలాగే ఉంటే మిరప తోటలను దున్ని వేయాల్సి వస్తుంది. మిరప సాగు చేసి ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నా.

– గంగిరెడ్డి, రైతు, నారేపల్లె

సాగులో రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టా



ఈ ఏడాది మిరప సాగు చేశా. నాకున్న 6 ఎకరాలలో మిరప పంటను సాగు చేసుకున్నా. సాగులో రూ.6 లక్షల మేర పెట్టుబడి పెట్టా. తోటలలో మిరప కాయలు కోతకు వచ్చాయి. మిరప కోత కోయాలంటే మార్కెట్‌లో ధరలేక కోయలేకున్నాం. మార్కెట్‌లో 50 కిలోలల బస్తా రూ.500ల ధర పలుకుతోంది. మిరపలో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నా.

– శివశంకర్‌రెడ్డి, రైతు, మబ్బుచింతలపల్లె

సాగు విస్తీర్ణం పెరగడంతోనే



ఈ ఏడాది పచ్చి మిరప సాగు విస్తీర్ణం పెరిగింది. తోటలలో ఒకేసారి మిరప కాయలు కోతకు రావడంతో ధరలు పడిపోయాయి. మార్కెట్‌కు సరఫరా ఎక్కువగా ఉండి డిమాండ్ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మార్కెట్ ధరలు పెరిగే పరిస్థితి కనిపించలేదు. తోటలలో పూర్తిస్థాయిలో మిరప కాయలు కోతకు వస్తే ధరలు ఇంకా తగ్గే అవకాశం లేకపోలేదు.

– రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ, పులివెందుల

భక్తి శ్రద్ధలతో బర్సీ మహోత్సవం

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా, జహీరియాలో వెలసిన శ్రీ హజరత్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో బర్సీ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్త జనసందోహం నడుమ పీఠాధిపతి నివాసం నుంచి పూల చాదర్, గంధం ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలోని స్వామి వారి మజార్లపై సమర్పించారు. అనంతరం ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు గంధం పంచి పెట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి నుంచి ఆశీస్సులు పొందారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించినట్లు డీఈ వెంకటనాగేంద్ర తెలిపారు. గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి యథావిధిగా విద్యార్థులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందిస్తున్నామన్నారు. ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో ఉన్న పీయూసీ 1 విద్యార్థులకు సెమిష్టర్-2 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కమలాపురంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయకుమారి

కమలాపురం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక 2వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు కిశోరి వికాసంపై ప్రత్యేక వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వారికి ఎక్కడైనా వివాహాలు జరుగుతుంటే తక్షణం మీ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా కౌమార దశలో ఉన్న బాల బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఎంఎస్‌కే పద్మజ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు అంగన్‌వాడీ కేంద్రాలలో జూన్ 10వ తేదీ వరకు బాల బాలికల వికాసంపై జరిగే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు హాజరై వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏఎన్ఎం పద్మావతి పరిసరాలు పరిశుభ్రత, ఆరోగ్యం తదితర వివరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని ఎస్.తిమ్మాపురం, చౌటిపల్లె గ్రామాల్లో కిషోర వికాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బాలికలు తమ హక్కులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల మహిళల్లో అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రోత్సహించిన వారికి రెండేళ్ల జైలు రూ.లక్ష జరిమాన విదిస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి,రాజేశ్వరి మహిళలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంలో భాగంగా పునరుత్పత్తి ఆరోగ్యం – బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఈడీ పి.సుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారిలు పోషకాలతో కూడిన ఆహారం, ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవడంలో ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే సిబ్బంది ప్రసన్న, ఏఎన్ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కార్మికులు



వేంపల్లెలో పారిశుధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

వేంపల్లె : పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి 5 నెలలుగా జీతాలు రాకపోవడంతో విధుల్లోకి వెళ్లకుండా ధర్నా చేపట్టారు. దీంతో సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి జీతాలు విషయంపై పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డితో చర్చించి జీతాలు మంజూరు చేయాలని కోరడంతో జీతాలు మంజూరుకు ఈఓ రామసుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ధర్నా చేస్తున్న పంచాయతీ సిబ్బంది ధర్నాను విరమించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం ఒక్కరికి రూ.10వేల చొప్పున చెల్లింపులు చెల్లిస్తామని ఈఓ హామీ ఇచ్చారని, గ్రామపంచాయతీలో రూ.16 లక్షలు ఉన్నాయని, వాటిని సిబ్బంది జీతాలు కోసం ఉపయోగిస్తామని ఈఓ చెప్పారన్నారు. అలాగే ఈనెలాఖరకు మార్కెట్ టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో సిబ్బందికి మొత్తం జీతాలు చెల్లిస్తామని కార్మికులకు ఈఓ హామీ ఇచ్చారని తెలిపారు.

కుట్టు మిషన్ల శిక్షణలో అవినీతిపై విచారణ జరిపించాలి



ఎంపీడీఓ జ్యోతికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ తరగతుల్లో జరిగిన రూ.167 కోట్ల అవినీతిపై విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు శివయాదవ్, ఎల్లారెడ్డిపల్లె సర్పంచ్ పోటు రవిశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ జ్యోతికి వారు అవినీతిపై విచారణ జరిపించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ మహిళలకు జరుగుతున్న కుట్టు మిషన్ల శిక్షణలో రూ.167 కోట్లు అవినీతి జరిగిందని, ఆ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. కుట్టు మిషన్ల శిక్షణకు టెండర్లు పిలిచారన్నారు. ఇందులో ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.23 వేలు కేటాయించారన్నారు. ఒక వ్యక్తికి కుట్టు మిషన్ కొనుగోలుతో పాటు శిక్షణకు రూ.7,300 కేటాయించారని, దీంతో మొత్తం లబ్ధిదారులకు రూ.73 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రూ. 230 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇందులో రూ.167 కోట్లు అవినీతి జరిగిందని తేటతెల్లమైందన్నారు. టెండర్లలో మొత్తం 65 కంపెనీలు పాల్గొనగా వాటిలో ఒకే సారి 56 కంపెనీలను రిజెక్ట్ చేశారన్నారు. మిగిలిన 9 కంపెనీల బిడ్లు ఓపెన్ చేసి కూటమి ప్రభుత్వాని అనుకూలంగా ఉన్న కంపెనీకే ఈ కాంట్రాక్ట్ కట్టబెట్టారని వారు ఆరోపించారు. ఈ పథకంలో జరిగిన అవినీతిని వెలికి తీసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి శ్రీను, పెండ్లిమర్రి బీసీ అధ్యక్షుడు వెంకట నారాయణ, గొందిపల్లె ఎక్స్ సర్పంచ్ వెంకటరమణ, మండల ప్రచార అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు రామాంజనేయులు యాదవ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి సహకరించాలి



భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంస్థ అధ్యక్షుడు రాజు

పులివెందుల టౌన్ : నియోజకవర్గ ప్రాంతంలో విశిష్ట సేవలు అందిస్తున్న స్నేహిత అమృత హస్తం సేవా సమితి నూతన భవన నిర్మాణానికి సహకరించాలని ఆ సంస్థ అధ్యక్షుడు మొమ్మెల రాజు దాతలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇంతవరకు దాతలు అందజేసిన విరాళాలతో భవన నిర్మాణాలు పునాదుల స్థాయి వరకు నిర్మించడంతో పాటు విద్యుత్ సరఫరాకు ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ లైన్, నీటి కోసం బోరు బావి, మోటారు బిగించడం జరిగిందన్నారు. మిగిలిన భవన నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలన్నారు. భవన నిర్మాణం కోసం రూ.20 వేలు, అపైన అందజేసే వారి పేర్లు శాశ్వత శిలాఫలకంపై లిఖించబడుతాయన్నారు. దాతలు స్పందించి విశిష్ట, విస్తృత సేవలు అందించేందుకు భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు సహృదయంతో స్పందించాలన్నారు. దాతలు విరాళాలు అందజేయాలనుకుంటే 9966509364 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవంగా మంచాలమ్మ తిరునాల



పూజలందుకుంటున్న మంచాలమ్మ అమ్మవారు

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్ల-గొల్లపల్లె గ్రామాల మధ్య వెలసిన పాలేటి గంగమ్మ (మంచాలమ్మ) 18వ తిరునాల వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామాల్లోని పుర వీధుల్లో ఊరేగించారు. చెక్కభజన తదితర కార్యక్రమాలు అలరించాయి. అలాగే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 కాండ్ల పాల పళ్ల ఎద్లకు నిర్వహించిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా, రూ.25,016, రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.7,016, రూ.5,016, రూ.3,016 నగదు బహుమతులు అందజేశారు.

జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

పులివెందుల రూరల్ : దేశ సరిహద్దులో మన తెలుగుజాతి ముద్దుబిడ్డ వీర జవాన్ మురళీనాయక్ అమరుడైన సందర్భంగా నల్లపురెడ్డిపల్లెలో శుక్రవారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జాతీయ జెండాలు చేతబూని జై భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

టైలింగ్ పాండ్ వద్ద నిరసన

– విస్తరణ పనులు అడ్డుకున్న గ్రామస్తులు



టైలింగ్ పాండ్ వద్ద నిలిచిపోయిన పనుల వద్ద కె.కె.కొట్టాల గ్రామస్తులు

వేముల : తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు టైలింగ్ పాండ్‌తో తీవ్రంగా నష్టపోతున్నామని, శాశ్వత పరిష్కారం చూపిన తర్వాతనే పనులు చేపట్టాలని కె.కె.కొట్టాల గ్రామస్తులు యురేనియం అధికారులకు సూచించారు. తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు నుంచి వస్తున్న వ్యర్థ పదార్థాలను టైలింగ్ పాండ్‌లో నింపుతున్నారు. టైలింగ్ పాండ్ నిండిపోవడంతో ఎత్తు పెంచే పనులను యురేనియం అధికారులు చేపట్టారు. దీంతో శుక్రవారం కె.కె.కొట్టాల గ్రామస్తులు టైలింగ్ పాండ్‌తో ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కారం చూపాలని గ్రామస్తులు విస్తరణ పనులను అడ్డుకున్నారు. అలాగే టైలింగ్ పాండ్ వద్ద నిరసన తెలుపుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా యురేనియం టైలింగ్ పాండ్‌తో తీవ్రంగా నష్టపోతున్నామని, తమ సమస్యలను, బాధలను యురేనియం అధికారులు పెడచెవిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టైలింగ్ పాండ్‌లోని దుమ్ము, ధూళి గ్రామంలోకి రావడంతో అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. ఎన్ని రోజులు ఇలా ఇబ్బందులు పడాలో, అవస్థలు పడాలో తెలియడంలేదని వాపోయారు. తమ గ్రామాన్ని, భూములను తీసుకుని శాశ్వత పరిష్కారం చూపి పనులు చేపట్టాలని యురేనియం అధికారులకు విజ్ఞప్తి చేశారు. మనుషులతో పనులు చేసుకోవచ్చునని, మిషన్లతో పనులు చేస్తే అడ్డుకుంటామని వారికి విన్నవించారు. టైలింగ్ పాండ్ పనులను అడ్డుకోవడంతో నిలిచిపోయాయి.

ముమ్మరంగా తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్ఐ

కమలాపురం : పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండు, క్రాస్ రోడ్డు, సంబటూరు బస్టాండు తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ తమ సిబ్బందితో కలసి రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు బ్యాగులు పరిశీలించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. వెహికల్ చెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైన కొత్త వ్యక్తులు కనిపిస్తే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రారంభమైన శ్రీలక్ష్మినరసింహస్వామి వార్షికోత్సవాలు



శ్రీలక్ష్మినరసింహస్వామి ఉత్సవ మూర్తులు

పులివెందుల టౌన్ : ముద్దనూరురోడ్డు వాసవీ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయని ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం అంకురార్పణతో ప్రారంభమై శ్రీలక్ష్మినరసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చతుర్వేద పారాయణం నిర్వహించారు. శనివారం ఉదయం సహస్రనామార్చన, యజ్ఞశాల ప్రవేశం, వాస్తు హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రధాన నిత్యహోమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీలక్ష్మి నరసింహస్వామి జయంతి సందర్భంగా తిరుప్పావడ సేవ నిర్వహించి సాయంత్రం ఉత్సవ మూర్తుల ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం విశేష పూజల నిర్వహించి సాయంత్రం శ్రీదేవి శ్రీభూదేవి సమేత వసంత వల్లభస్వామి తిరు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


పోలీసుల కళాజాత



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాత బృందం

లింగాల : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన కోమన్నూతల గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కళాజాత నిర్వహించారు. పాటలు, నాటికల ద్వారా ప్రజలను చైతన్యపరిచారు. ఫ్యాక్షన్ ను విడనాడాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గేయాల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్యాక్షన్ వల్ల కలిగే ఇబ్బందులు, పిల్లల చదువులవల్ల వారి భవిష్యత్‌కు కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీనాయక్, సీఐ రమణ, ఎస్ఐ మధుసూదనరావు, గ్రామంలోని ఫ్యాక్షన్ నాయకులు, వారి అనుచరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో బాధపడుతున్న గుర్తుతెలియని వ్యక్తి



పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న నిరాశ్రయుల ఆశ్రమంలో ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారని నిర్వాహకురాలు శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల స్థానిక శిల్పారామం వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి నిరాశ్రయుల ఆశ్రమానికి తీసుకు వచ్చామన్నారు. ఆ వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పులివెందుల ప్రాంతంలో అతని కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరాశ్రయుల ఆశ్రమాన్ని సంప్రదించాలన్నారు.

నేటి నుంచి నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం అవుతున్నట్లు ఆలయ అధికారి మోహన్ తెలిపారు.

ఉత్సవాలు ఈ నెల 10 నుంచి 20 వరకు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ దీపాలంకరణతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. 16న కల్యాణోత్సవం, 17న రథోత్సవం, 20న పుష్పయాగం నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.